# గుణ సంధి

ఋ—ను—బంధం .... అని, బిగ్గరగా సణుక్కుంటున్నట్లు గొణుకుతున్నాడు....నేస్తం.

ఆ ఊరివాడిని కాబట్టి, అభిమానంకొద్దీ.... 'కృష్ణా పత్రిక సారస్వతానుబంధం' అని నేను కలగంటున్నట్టు అర్థం చేసుకున్నాను.

"కాదోయీ....ఋణానుబంధం...." ఇదీ వాడి సొద.

"ఎక్కడో - ఏ కడనో, పల్లెల్లో పుట్టి—పెరిగిన బందరులో, పద్దువ్రాసి కొనుక్కున్న ఉత్తరీయం, అలహాబాదులో ఆ చలిలో గజగజలాడే ముసలి బడుగు అవస్థకు గుండె కరగి...రైలు కదులుతూండగా అలా కిటికీలోంచి గిరవాటువేశాను.... ఎక్కడి కెక్కడో చూశావా....యింతకూ అది వాడికి ప్రాప్తం...."

ఇత్యాదయః....

అవును-భాయీ-గా తల ఊగించుతూ, దానబ్బగా, నా కథ అల్లాను....

"దోవవెంటే పోతూవుంటే....కానీ దొరికింది. కానీ దొరికితే, కలిసి వస్తుందని నానుడి. కానీ చూద్దాం .... పార్కు మలుపులో కానీ—కానీ లాటరీ పరుచుకు కూర్చుంటే, విశ్కేరీ అద్దంమీద దాన్ని కాచాను: కాచి-కాచి, కలకాలం ఉసూరుమనేట్టు, అర్ధరూపాయి, వాడి దగ్గర దోచాను.

(చెప్పడం మరచిపోయినట్లున్నాను — యిందాకటినుంచి ఇదంతా జరుగుతూన్నది...ఎక్కడో కాదు, మన బెజవాడలో.)

అప్పటికి రెండున్నర అయింది. మధ్యాహ్నం. ఆదివారం పగలు సినిమాకు ఆ కాస్త ఖర్చుపెట్టేస్తే...ఆ దోషం అంతటితో తీరిపోతుందనుకున్నాను.

కాఫీ-గీఫీ ... కాసిని సిగరెట్లూ..,అనుకోనిచ్చే తరగతికి డబ్బులు మిగుల్చు కుంటే చాలు.

....త్రోవలో ఆడుతూ – పాడుతూ నేను అక్కడికి చేరుకునేటప్పటికే ఆట మొదలు వేశారు.

ఆవాళా యింకా, విప్రనారాయణే! అదివరకు దాన్ని కచ్చా–పచ్చాగా అయిదారు సార్లు, సగం - సగం చూశాను. అరవ చింతామణేమోకదా అనుకొని పరుగెత్తాను సుమా....తారీఖు తడిసి సినలుగా కనబడటంలేదు. (అవి రేపటినుంచి) – అన్నాడు, కన్నం అవతలవాడు.

ఇవతల నేను తప్ప ఇంకో పిట్ట మిగలలేదు. యింతలో, వాన తగులు కున్నది.

ఆడవాళ్ళ గేటుమీది ఆర్చితప్ప....ఆ బారు–బారునా, ఎక్కడా అచ్ఛాదన లేదు....అక్కడే నక్కాను.

నా పక్కను, ఓ కుర్రవాడు, చిరుగుల బనీనంతా తడిసి ముద్దయి, తలుపుకెక్క నానుకొని యీదురుకు గజగజ-లాడుతున్నాడు.

గేటులో ఉండే రకమేమో అనుకున్నాను. కాదన్నాడు. చేగోడీల బాపతేమో అనుకున్నాను: ఉహూ( అన్నాడు. అన్నా, వాళ్ళూ అందరూ ముందు లోపలికి వెళ్ళిపోతే, తాను ఒక్కడూ వెనకపడి మిగిలిపోయినా నన్నాడు. ఎల్లా లోపలికి పోవడం? డబ్బులు వాళ్ళ దగ్గిర వున్నాయి....టిక్కెట్టులేనిదే గేటు దగ్గిర లోపలికి పోనీయరు. ఎల్లా లోపలికి వెళ్ళడం?....

అవును పాపం, టిక్కెట్టు లేకుండా లోపలికి పోలేడు....

ఆ కాసిని డబ్బులూ పెట్టి టిక్కెట్టుకొని, అది వాడి చేతిలో పెట్టి, ఉడాయించ మన్నాను. అంత వానలోనూ తడుస్తూ నేను యింటికి వచ్చాను....

చూడు....ఎక్కడి కెక్కడ?....

ఎవరో పసివాడో, పెద్దవాడో....పారేసుకున్న కానీ....

ఎందరి కాళ్లో దులిపి....నాకు కట్టపెట్టాడు, లాటరీవాడు.

నేను అది మూట కట్టుకుని కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి....హస్తాన్వితంగా అందులో కొంత....ఆ పసివాడిపరంగా దరిసించాను. ఎక్కడి కెక్కడ?....

— "ఆ కుర్రవాడి మాటలన్నీ నిజమని నమ్మావ్?"

"లేదోయ్....అవన్నీ అబద్ధాలని వాడి మొఖమే అంటూంది."

"అయితే, మరి...."

"....వాడు అనుకోని పని మనం చేస్తే....ఆ హాయికి ఖరీదులేదు."

...."వానలో తడవకపోతే, వెలిసేదాకా ఆగితే ఏం మునుకుపోయిందో?" అంతా విన్న తరువాత యీ సందేహం రాకతప్పదు.

"ఏమో, అప్పు డలా తోచిందికాదు."

"అవునులే. అంతటి ఘనకార్యం చేసినప్పుడు....ఆ మాత్రం ఆవేశం....ఆపాటి ఒళ్ళు తెలియకపోవడం లేకపోతే ఎల్లా? ఆ హుషారులో .... ఆకాశంమీద నడిచావనుకుంటాను!....ఏం?"

"ఊహుఁ .... అడుగుతీసి అడుగు వేయలేకపోయినాను; అందుకే తడిసి ముప్పందుమైంది !"

"ఎందుచేతనో?...."

"అఁ....ముక్తసరిగా టిక్కెట్టు మాత్రమే కొని యిచ్చాను కాని....పైనో అర్ధణా అణా కొనుక్కుతినమని యిచ్చేపాటి తెలివీ, తెగువా లేకపోయింది కదా....ఈ ఆలోచన సోయేప్పటికల్లా, నా మీద నాకే ఎంత అసహ్యం వేసిందనుకున్నావ్!"

"ఔనులే పాపం....నీ ఔదార్యం ఎవరెరుగరు? కాని....నీ జేబు ఆ తరుణంలో పూర్తిగా ఖాళీ అన్న సంగతి....నీకు గుర్తులేకపోయినా .... మేము గ్రహించుకోగలము...."

"ఛస్....నీ విషపు ఆలోచనతో కథ కాస్తా చెడిపోయింది...."

"కాదోయ్....ఇది కథే అయితే ఓ కొలిక్కివచ్చి పకడ్‌గా రక్తి కట్టింది...."

(సాగకీసినకొద్దీ....బిగిసి పీటముడి పడుతుంది....ఇద్దరమూ కథల కామ రాజులమే....)